


పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్

ప్రజాశక్తి - పార్వతీపురం



పార్వతీపురం సబ్ కలెక్టర్ గా అశుతోష్ శ్రీవాత్సవ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేసియన బదిలీపై ఇక్కడి సబ్ కలెక్టర్ గా వచ్చారు. అనంతరం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కూటమి నాయకుల్లో గంపెడాశలు

- పార్టీ పెద్దల పరిశీలనలో ఆశావహుల పేర్లు
- త్వరలో నామినేటెడ్ పదవుల పందేరం



ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పందేరంపై మన్యం జిల్లాలో కూటమి పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటింది. దీంతో గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేసిన నాయకులు నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కార్పొరేషన్, ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పదవుల భర్తీ కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ఆశావహుల పేర్లను స్థానిక ఎమ్మెల్యేల ద్వారా కూటమి పార్టీలు తెప్పించుకున్నాయి. అయితే కూటమి పార్టీల బలాబలాలను బట్టి నామినేటెడ్ పదవుల్లో ఏ పార్టీ కి ఎన్ని ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. కూటమిలో ప్రధాన పార్టీ టిడిపి కావడంతో నామినేటెడ్ పదవుల్లో 60శాతం, జనసేనకు 30 శాతం, బిజెపికి 10 శాతం కేటాయించాలని నిర్ణయించారు. టిడిపి,జనసేన, బిజెపి ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గాల్లో ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులకు 60 శాతం పదవులు కేటాయించాలని తీర్మానించారు. ఇందులో భాగంగా మన్యం జిల్లాలో గల నాలుగు నియోజకవర్గాల్లో మూడు టిడిపి, ఒకటి జనసేన ఎమ్మెల్యే లున్నారు. మూడు ఎస్టీ, ఒక ఎస్సీ నియోజకవర్గం లో నామినేటెడ్ పదవుల పందేరం జరగాల్సి వుంది. సాలూరు ఎస్టీ నియోజకవర్గంలో మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో టిడిపి నాయకులకు 60 శాతం, జనసేన నాయకులకు 30 శాతం, బిజెపి నాయకులకు 10 శాతం పదవులు కేటాయింపు జరగాలి. ఈ నియోజకవర్గంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ కూడా వున్నారు. నామినేటెడ్ పదవుల పంపిణీలో టిడిపి అధిష్టానం మంత్రి సంధ్యారాణి సిఫార్సు లకే ప్రాధాన్యత ఇస్తుందా, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ మాటకే విలువనిస్తుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎక్కువ మందే ఉన్నారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీల నుంచి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు వున్నారు. పట్టణ సీనియర్ నాయకులు పప్పల మోహన్, నిమ్మాది తిరుపతిరావు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కూనిశెట్టి భీమారావు ముందువరుసలో వున్నారు. మండలాల్లోనూ సీనియర్ నాయకులు కొంతమంది పదవులను ఆశిస్తున్నారు. 30 శాతం కోటాలో జనసేన నాయకులకు కూడా పదవులు దక్కాల్సి ఉంది. బిజెపికి సంబంధించి పదిశాతం కోటాలో కొందరు నాయకులు వున్నారు. ఇందులో పెద్దలు నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం నియోజకవర్గాల్లో పదవుల పందేరం ఎలా జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లోనూ టిడిపి ఎమ్మెల్యేలు వుండడంతో ఇదే ఫార్ములా ప్రకారం పదవుల పందేరం చేపట్టాల్సి ఉంటుంది. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియోజకవర్గాల్లో ఆశావా హుల సంఖ్య ఎక్కువగానే కనిపిస్తోంది. పార్వతీపురం నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ టిడిపిలోనే కొనసాగుతున్నారు. అయితే గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం చిరంజీవులు, జగదీష్ పని చేయలేదనే కారణంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర అనుచరులు గతంలో డిమాండ్ చేశారు. కురుపాం నియోజకవర్గం లో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గెలుపు కోసం మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, యువ నాయకుడు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పని చేశారు.నామినేటెడ్ పదవుల పందేరం లో టిడిపి నాయకత్వం ఎమ్మెల్యేల సిఫార్సులకే పెద్ద పీట వేస్తుందా, వారి విజయం కోసం కృషి చేసిన సీనియర్ నేతల సిఫార్సు లకూ ప్రాధాన్యత ఇస్తుందా లేదా అనేది తేలాల్సి ఉంది.

పాలకొండ నియోజక వర్గం లో ఎమ్మెల్యే జయకృష్ణ జనసేన పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. వాస్తవం గా ఆయన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వున్నారు. అయితే ఎన్నికల ముందు కూటమి పార్టీల పొత్తులో భాగంగా నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో జయకృష్ణ ఆపార్టీ అభ్యర్థి గా పోటీ చేశారు. ఈ నియోజకవర్గం లో మాత్రం జనసేన ద్వితీయ శ్రేణి నాయకులకు 60 శాతం పదవులు, టిడిపి నాయకులకు 30 శాతం పదవులు దక్కాల్సి వుంది. అయితే నామినేటెడ్ పదవుల భర్తీ లో కూటమి పెద్దలు 60:30:10 నిష్పత్తి ప్రాతిపదికన ఏమేరకు పంపిణీ చేస్తారనేది అంతుచిక్కడం లేదు. ఆశావహుల సంఖ్య ఎక్కువ గా వున్న నేపథ్యంలో నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం పదవుల పందేరం జరగాల్సి వున్నప్పటికీ ఒకవేళ ఆశించిన వారికి పదవులు దక్కకపోతే ప్రతిస్పందన ఎలా ఉంటుందనేది వేచిచూడాల్సిందే.

స్వచ్ఛత వైపు అడుగులు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దేశం స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోందని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 2 వరకు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛత కార్యకలాపాల స్ఫూర్తి స్వచ్ఛందత, శ్రమదాన్‌లో భాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు, డ్రెయిన్‌లు, నల్లాలు మొదలైన జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలపై స్వచ్ఛతా సేవా కార్యక్రమం దష్టి సారించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివద్ధి చెందుతుందని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. స్వచ్ఛ భారత్ నిర్మించాలనే బాపు కలను నెరవేర్చాలని జిల్లా వాసులకు కలెక్టర్ పిలుపునిచ్చారు. 14 రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాల న్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, వ్యాపారవేత్తలు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ కోరారు. స్వచ్ఛ జిల్లా, మండలాలు, గ్రామాలుగా రూపుదిద్దుటకు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు

స్వచ్ఛత హీ సేవాలో భాగస్వామ్యం కావాలి

భామిని : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు అని అన్నారు. పక్షం రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. భామిని లో జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో శాసన సభ్యులుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎల్ ఐఎంసిఒ (అలింకో(ప్రతినిధి రవిశంకర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కే కవిత తదితరులు పాల్గొన్నారు.

19 నుండి ఇసుక పోర్టల్

ఈనెల 19 నుంచి ఇసుక పోర్టల్ ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అవసరం ఉన్నవాళ్లు ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని చెప్పారు. ఇసుక పొందుటకు కేవలం తవ్వకాలు, నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే భరించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ బుక్ చేసుకున్న వాహనాల వివరాలు పోలీసు శాఖకు అందించాలని ఆదేశించారు. నమోదు చేసుకున్న వాహనాలు మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. సొంత ఇంటి నిర్మాణానికి ఇసుకను ఎద్దుల బండితో తీసుకెళ్లొచ్చనిసూచించారు. గృహ నిర్మాణంపై దృష్టి సారించాలని పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గృహ నిర్మాణ లేఔట్‌కు ఒక వ్యక్తిని ఇన్చార్జిగా నియమించాలని సూచించారు. సమావేశంలో జెసి శోబిక, ఎఎస్‌పి దిలీప్‌కిరణ్ పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

దబ్బగెడ్డ రహదారికి రూ 1.60 కోట్లు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ- నగుల్లు దబ్బగెడ్డ మధ్య రహదారికి రూ.కోటీ 60 లక్షలు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డిపిఆర్ ఇఇ జి.రవి తెలిపారు. మంగళవారం ఈ రహదారిని ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. రెండు కిలోమీటర్ల, వంద మీటర్లు రహదారి నిర్మాణం, ఆడారుగెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వంతెన నిర్మాణం చేపట్టనున్న ఆడారుగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం రహదారికి మాత్రమే నిధులు మంజూరయ్యాయని, కొండ ప్రాంతంలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఆ తర్వాత దాని అంచనాలు వేయడం జరుగుతుందని ఆయన ప్రజాశక్తికి తెలిపారు

వందేళ్లు ఉండేలా చూడండి..

రహదారి నిర్మాణం చేపట్టాక రహదారి కాల పరిమితి వందేళ్లు ఉండేలా నిర్మాణం చేయడం జరుగుతుందని, ప్రజలు కూడా ఆ రీతిగా రహదారిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రహదారికి కొలతలు వేస్తున్న సమయంలో అక్కడికి వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. రహదారి నిర్మాణం జరిగిన తర్వాత ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు నడపకుండా చూసుకోవల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు

మంత్రి సంధ్యారాణి కృషితోనే...

ప్రస్తుత రహదారి నిర్మాణానికి సంబంధించిన నిధులు మంజూరులో గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కృషి చేశారని స్థానిక టిడిపి నాయకులు మిండి శ్రీనివాసరావు,లావేటి కష్ణ అన్నారు ఈ రహదారి నిర్మాణం పూర్తయినట్లయితే మార్కొండపుట్టి, పనసభద్ర, దబ్బగెడ్డ పంచాయతీల ప్రజలతో పాటు పార్వతీపురం మండల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఇ చిన్నం నాయుడు, మండల ఇంజనీర్ బి.రజిత్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పెరుమాల తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 274 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక శ్రీ సత్య సాయి డిగ్రీ కాలేజీ ఆవరణంలో మెగా జాబ్ మేళాను మంగళవారం నిర్వహించారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుండి 30ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులకు నిర్వహించిన జాబ్ మేళాలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కంపెనీలు కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, ట్రైనీ ఆపరేటర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, పికింగ్ అండ్ ప్యాకింగ్, ప్రొబేషనరీ ఆఫీసర్, టెలి కాలర్స్ - ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసీ అసిస్టెంట్, డ్రైవర్, క్లర్క్, వెహికల్ హెల్పర్ తదితర పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 695 మంది అభ్యర్థులు పాల్గొనగా 274 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ మేళాను అందిపుచ్చుకోవాలన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు కట్టుబడి ప్రభుత్వం ఉంటుందని ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించాలని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని ప్రాధాన్యతగా భావిస్తామన్నారు. ప్రతి నెలా జాబ్ మేళా నియోజకవర్గంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ ఎ.శ్రీ నివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ మాట్లాడుతూ జాబ్ మేళాలు రాబోయే రోజుల్లో నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తామమన్నారు. జాబ్ మేళాలో శ్రీసత్య సాయి విద్య సంస్థల వ్యవస్థాపకులు బి.లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ డి.వెంకటరమణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు జిల్లా వ్యాప్తంగా వేయించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయపార్వతి తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల హైస్కూల్, అంగన్వాడి కేంద్రలో డీవార్మింగ్ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చేతులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అందరికీ అవగాహన కల్పించారు. శరీరంలో నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం మొదలగు ఆరోగ్య సమస్యలు ఉంటాయన్నారు. కావున అందుచేత 1 సం. నుండి 19 సం. వరకు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సిబ్బందికి సూచించారు. ఆర్బిఎస్ కె జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డీవార్మింగ్ కార్యక్రమంలో 1,90,289 మంది పిల్లలు, విద్యార్థులకు వేయించామని, ఏమైనా కారణాల వల్ల మంగళవారం కార్యక్రమంలో వేసుకొని వాళ్లకు 25న జరగబోయే మూప్‌అప్ ప్రోగ్రాంలో వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ నారాయణరావు, ప్రిన్సిపల్ జె.రామారావు, హెచ్‌ఎం పివి ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, ఎన్‌జిఒ అధ్యక్షులు జి.కిషోర్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులుపురుగు నివారణ మందు వేస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

కొమరాడ : డి-వార్మింగ్ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి. జగన్మోహనరావు, ఆర్బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ విక్రంపురం హైస్కూల్ లో పరిశీలించారు. విద్యార్దులకు ఆల్బెండజోల్ మాత్రలువేయడాన్ని దగ్గరుండి పరిశీలించి, పలువురు విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పిహెచ్‌ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది నిర్మల, ప్రమీల, రమేష్, అప్పలనాయుడు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం సమకూరుతుందని పెదఅంకాలం పిహెచ్‌సి ఇఒ సూరి నారాయణ అన్నారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. అనంతరం విద్యార్థులకు భాగంగా చేతులను శుభ్రం చేసుకునే విధానం వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఇఒ సూరిదేవుడు, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల(బాలుర)లో మంగళవారం విద్యార్థులకు నులుపురుగు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుంభరో మాట్లాడుతూ నులిపురుగు మాత్రలు వేయడం వల్ల కడుపు నొప్పి రాదని, మూడు నెలలకు ఒకసారి తరచుగా ఈ మాత్రలు వేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎం జానకి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

గరుగుబిల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం (2) లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను ఎంపిడిఒ జి.పైడితల్లి వేయించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, స్థానిక ఎఎన్ఎం బొచ్చు శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పల్ల కృష్ణవేణి, మూడడ్ల స్వాతి, సహాయకురాలు సీమల గౌరి తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఎంఇఒలను కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో విద్యాశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యూట్రిషన్ గార్డెన్స్, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరు, డ్రాపవుట్స్, మై స్కూలు- మై ప్రైడ్, పి ఎం శ్రీ స్కూల్స్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మై స్కూలు-మై ప్రైడ్ కార్యక్రమం ద్వారా పదవ తరగతి ఉత్తీర్ణతా శాతం పెంచడానికి పరిమితం చేయకుండా, అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలలో సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండేలా తీర్చిదిద్దడంతో పాటు ఆటలు, వ్యాసరచనలు, చర్చలలో పాల్గొనుట, సైన్స్ ఫేర్‌ల్లో పాల్గొనేలా తీర్చిదిద్దాలని తెలిపారు. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా సర్దుబాటు చేసుకోవాలని, విద్యార్థులకు బోధనకు ఇబ్బందుల్లేకుండా చూడాలని తెలిపారు. జిల్లాకు కేటాయించిన పిఎం శ్రీ మోడల్ పాఠశాలలను వారు తెలియజేసిన ప్రమాణాల మేరకు రూపొందించాలని కలెక్టరు తెలిపారు. జిల్లాలో మన బడి - మన తోట కార్యక్రమంలో భాగంగా సాగుకు అనుకూలంగా గల 1272 పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పెంపొందించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులున్నా, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులున్నా కొన్ని మండలాల్లో విద్యార్థుల శాతం తగ్గిపోతుందన్నారు. కావున ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని తెలిపారు. సమావేశంలో డిఇఒ జి.పగడాలమ్మ, డిప్యూటీ డిఇఒలు బి.రాజ్ కుమార్, పి.కృష్ణమూర్తి, ఎంఇఒలు పాల్గొన్నారు.

అప్రెంటీస్ శిక్షణ ఇప్పించరూ!

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రిలో అప్రెంటిస్ శిక్షణ ఇప్పించాలని విద్యార్థినిలు కోరుతున్నారు. ఇప్పటికే కెజిబివిలో ఎంపిహెచ్ఒ కోర్సు రెండేళ్లు చదువుకున్నామని, ఏరియా ఆసుపత్రిలో అప్రెంటిస్ శిక్షణ ఇప్పించాలని విద్యార్థినిలు కోరారు. అధికారులు స్పందించి శిక్షణ ఇప్పించాలని వారు కోరుతున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విశ్వకర్మ ద్వారకానగరి వంటి నగరాలు నిర్మించినట్లుగా పురాణాలు తెలియజేస్తున్నాయని, అటువంటి మహనీయుని స్మరించుకొని పూజించుకోవడం మన అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, కలెక్టరు కార్యాలయ ఎఒ ఎం.సావిత్రి, సూపరింటెండెంటు శ్రీరామ్మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రామం మెయిన్ రోడ్డు వద్ద విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు ఉత్సవాల్లో భాగంగా విశ్వకర్మ ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. తరతరాల నుంచి విశ్వకర్మను ఆరాధ్య దైవంగా విశ్వ బ్రాహ్మణులు పూజిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి కె.గౌరీశ్వరరావు తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



విశ్వకర్మకు నివాళ్లు అర్పిస్తున్న జెసి శోబిక, డిఆర్ఒ, అధికారులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసలో విశ్వకర్మ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమారామలింగేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అజ్జరాపు కాశీవిశ్వేశ్వరరావు, కిరణంపల్లి తిరుపతిరావు, చింతాడ తవి టాచారి, పలు గ్రామాలకు చెందిన గ్రామాలకు చెందిన విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

స్వార్థపరులే వైసిపిని వీడిపోతారు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

వైసిపిలో ఉన్న కొంతమంది స్వార్థపరులే పార్టీని వీడిపోతారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి తలుపులు తెరిస్తే వైసిపి ఖాళీ అవుతుందని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానించడంపై ఆయన మాట్లాడారు. తమ పార్టీలో ఉన్న కొంతమంది నాయకులు పదవులు కోసమో, పనులు కోసమో అధికారపార్టీలోకి వెళ్లిపోతే పోవచ్చునని చెప్పారు. అంత మాత్రాన వైసిపికి జరిగిన నష్టమేమీ లేదన్నారు. పార్టీలో వున్న నాయకులతోనే రాజకీయం చేస్తామని చెప్పారు. తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఎవర్నీ ఇబ్బంది పెట్టలేదన్నారు.ఏ ఉద్యోగిని, అధికారిని బెదిరించి బదిలీ చేయించుకుని వెళ్లిపోవాలని హెచ్చరించలేదన్నారు. ఏ చిరుద్యోగి పొట్టకొట్టలేదని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పండుగలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని చెప్పారు. ఎవరి మనోభావాలకు అనుగుణంగా వారిని పండుగలు నిర్వహించుకునే అవకాశం కల్పించామని అన్నారు. శ్యామలాంబ పండుగ నిర్వహణపై మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడే గ్రామపెద్దలు శ్యామలాంబ పండుగ నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారని చెప్పారు. కరోనా కారణంగా ఒకసారి, వేరే కారణం చేత మరోసారి పండుగని పెద్దలే వాయిదా వేశారని గుర్తు చేశారు. తనపై విమర్శలు చేసేముందు ఒకటికి రెండు సార్లు టిడిపి నాయకులు ఆలోచించాలని హితవు పలికారు. పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు కాంగ్రెస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు వర్కులు తీసుకున్నారని, పనులు కూడా చేయించుకున్నారని చెప్పారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పల నాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మాజీ కౌన్సిలర్లు పిరిడి రామకష్ణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.



వైద్యుల్లేక బోసిపోయిన పిహెచ్‌సి

వైద్యుల్లేక బోసిపోయిన ఆస్పత్రులు

ప్రజాశక్తి - వీరఘట్టం

జిఒ 85ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం చలో విజయవాడ కార్యక్రమంలో వైద్యులు పాల్గొనడంతో నర్సులు సేవలకు నిమగ్నమయ్యారు. జిఒ 85ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10 నుంచి నుండి వైద్యాధికారులు వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు సుమారు 200 మంది వరకు రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. వైద్యులు ఆందోళనలో ఉండడంతో రోగులు కూడా క్రమేపీ తగ్గుముఖం పట్టారు. ప్రస్తుం రోజుకు 40మందికి వైద్య పరీక్షలు చేయడం కష్టంగా ఉందని నర్సులు వాపోతున్నారు. దీంతో ఆసుపత్రి నేడు బోసిపోయి దర్శనం ఇస్తుంది.

ఉలిపిరి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారి, ప్రాజెక్టు అధికారి వారికి వినతులు అందించినట్లు తెలిపారు. కొంతమంది వ్యక్తులు పాఠశాలలో ప్రవేశించి మహిళా ఉపాధ్యాయులను తరచుగా బెదిరిస్తున్నారని పాఠశాలను సక్రమంగా నిర్మించనివ్వకుండా విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ప్రకటనలో తెలిపారు. కనుక అధికారులు స్పందించి వీరికి రక్షణ కల్పించాలని విద్యార్థులు భవిష్యత్తుకు భరోసా ఇస్తూ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.


వికలాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే జయకృష్ణ

రూ.28 లక్షల విలువ గల ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి -భామిని

ఆశావాహ బ్లాక్‌లో భాగంగా మండలంలో వికలాంగులకు రూ.28 లక్షల విలువ గల ఉపకరణాలను విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో మంగళ వారం పంపిణీ చేశారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. దేశంలో 500 ఆశావాహ బ్లాక్‌ల్లో భాగంగా భామిని మండలంలో గత ఏడాది లబ్ధిదారులను గుర్తించారు. హైదరాబాద్ కు చెందిన అలింకో సంస్థ (ఏఎల్ ఐఎంసిఓ) వికలాంగులకు అవసరమయ్యే ఉపకరణాలు - బ్యాటరీ సైకిళ్లు, ట్రై సైకిల్స్, వినికిడి పరికరాలు, సెల్ ఫోన్లు, కృత్రిమ కాళ్లు మొదలైన పరికరాలను పంపిణీ చేశారు. 147 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షలు విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భామిని మండలం ఆశావాహ జిల్లాగా ఉండటం మంచి పరిణామం అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని చెప్పారు. వికలాంగులకు ఉపకరణాలు పంపిణీకి అవసరమగు మరిన్ని శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆశావహ బ్లాక్‌లో భాగంగా పనితీరును అనుసరించి మంచి ప్రోత్సాహకాలు అందుతాయని ఆయన చెప్పారు.కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేత్ర చికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ పరిధిలో 30 మంది వృద్ధులకు నేత్ర చికిత్సలు నిమిత్తం పుష్పగిరి కంటి ఆసుపత్రికి మంగళవారం తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లోనూ, ముఖ్యమంత్రి నేత్ర కేంద్రాల్లో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్(అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం తరలించామని వీరికి ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు మాలిక, ఆశా కార్య కర్తలు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ ఎంపికలు

ప్రజాశక్తి - సీతంపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడల్లో క్రీడాకారుల ఎంపికలో సుమారు 500 మంది ఉత్సాహంగా విద్యార్థులంతా పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఉప విద్యాశాఖ అధికారి పాలకనారాయుడు, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, ఎఎంఒ కోటిబాబు, జిసిటి ఒ.రాములమ్మ పాల్గొన్నారు. ఈ ఎంపికలు క్రీడల పర్యవేక్షణ అధికారి జాకబ్ దయానంద్ ఆధ్వర్యంలో జరిగాయి. వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, రమణ, సింహాచలం, హరినాద్,కళ్యాణ్, భాస్కర్, జగదీష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడలలో పాల్గొననున్నారు.

డిఆర్ డిపోలను ఒడిశా అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో అడ్డాకులగూడలో నిర్వహిస్తున్న డిఆర్ డిపోను, సీతంపేటలో గల విడివికె కేంద్రాలను భువనేశ్వర్ అధికారులు టిడిసిసిఒఎల్ మోనిటింగ్ మేనేజర్ డబోతోష్ మలహోత్రా, కన్సల్టెంట్ లగాన మహాపాత్రో పరిశీలించారు. అక్కడ గిరిజనులకు ఏ విధంగా నిత్యవసర సరుకులు అందిస్తున్నారో అధ్యయనం చేశారు. అలాగే వెలుగు ద్వారా నిర్వహిస్తున్న విడివికె కేంద్రాన్ని పరిశీలించారు. అగరబత్తీలు, జీడి ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ, ఎపిడి సన్యాసిరావు తదితరులు ఉన్నారు

గిరిజన మహిళా ఎంపిటిసి పై దాడి

సుమోటో కేసు నమోదుపై ఎస్‌టి కమిషన్ ఆదేశాలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మరిపల్లి గిరిజన మహిళా ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాంపై జరిగిన దాడిని సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో మాట్లాడి మహిళా ఎంపిటిసి సభ్యురాలు సీతారాంపై దాడికి దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక అందించాలని కోరినట్లు శంకరరావు చెప్పారు.

జిల్లా రవాణాశాఖ అధికారిగా దుర్గా ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా రవాణా అధికారిగా టి.దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా వ్యవస్థ చక్కగా నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇసుక రవాణాకు వాహనాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, అదేవిధంగా రానున్న ధాన్యం సేకరణ సమయంలోను వాహనాల అవసరాన్ని ముందుగానే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఆర్‌డిఒ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- పార్వతీపురం

రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన కె.హేమలత సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. బదిలీపై వెళ్తున్న హేమలతకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డిఒగా డివిజన్లో మంచి సేవలను అందించారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఆర్డీవో గా అందించిన సేవలు ప్రతి ఒక్కరి మనల్ని పొందారని చెప్పారు. బదిలీపై వెళ్తున్న హేమలత మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో బాధ్యతలను నిర్వహించామని అన్నారు. ఎన్నికల సమయంలోనూ, ఇతర అనేక సందర్భాల్లోనూ పై అధికారుల సహకారం మరువలేనిదని ఆమె పేర్కొన్నారు.

ముంపు బాధితులకు కళాకారుల సంఘం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురానికి చెందిన శ్రీవాణి శివాణి నాట్య కళా మండలికి చెందిన కళాకారులు విజయవాడ ముంపు బాధితుల సహాయార్ధం సేకరించిన విరాళాలను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి అందించారు. ఆ సంఘం అధ్యక్షులు బడే శ్రీరాములునాయుడు, నాగిరెడ్డి, అమరాపు రామకృష్ణ, పెంట సత్యంనాయుడు, పల్లా హేమసుందర్ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి వారు సేకరించిన రూ.లక్షా8వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాకారులు చిత్తశుద్ధి, సమాజంపై వారికి ఉన్న బాధ్యతను తెలియజేస్తుందని, వారిని ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గంలోని కూటమిని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


సేకరించిన విరాళాలను ఎమ్మెల్యేకు అందజేస్తున్న కళాకారులు

పలుచోట్ల స్వచ్ఛతహి సేవా

జిల్లా వ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు తలపెట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో మొదటి మంగళవారం జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల్లో జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు.

పార్వతీపురంరూరల్ : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన పార్వతీపురం పట్టణ నాలుగు రోడ్లు కూడలి వద్ద, మండలంలోని సంగంవలసలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు చేపట్టి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్పర్సన్ గౌరీశ్వరి కమిషనర్ శ్రీనివాసరావు , బిజెపి నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఉద్యోగులు, పట్టణ మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎఇ ఆర్.వేణుగోపాల్, ఎంఇఒ సత్యనారాయణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వద్ద చేరుకుని మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి ఎం.నాగభూషణరావు, పంచాయతీ ఇఒ ఎం.రవి, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎపిఎం బి.శివున్నాయుడు, కూటమి నాయకులు అంగన్వాడీ సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాలను శుభ్ర పరిచారు. కార్యక్రమం లో ఎంపిడిఒ సల్మాన్ రాజు, సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ రావు, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్, జడ్పీ హైస్కూల్ చైర్మన్ సొంటిన రాజేష్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, విఆర్‌ఒ హరికృష్ణ, ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి గౌరీ శంకర్, సచివాలయం ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పాంచాలిలో సర్పంచ్ గూడెపు యుగంధర్, ఎఒ పాత్రో ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం జరిగిందిఙ ఈ కార్యక్రమంలో పలు శాఖ అధికారులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛందంగా గ్రామంలో వీధుల్లోనూ, రోడ్లపైన చెత్తను శుభ్రపరిచారు. రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్వచ్ఛత హి సేవా కార్య క్రమాన్ని మండలంలోని మరుపెంటలో ఎంపిపి ఉరిటి రామారావు ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉరిటి నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ ఏగిరెడ్డి పోలినాయుడు, వెలుగు గ్రామైక్య సంఘం అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో ఇంఛార్జి కమిషనర్ రాఘవాచార్యులు మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మోహన్ రావు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురంలో చెత్తను తొలగిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

కొమరాడ : మండలంలో వాడవాడలా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మొదటి రోజున విజవంతంగా నిర్వహించినట్లు ఎంపిడిఒ కె.మల్లికార్జునరావు తెలిపారు. కొమరాడ గ్రామ సచివాలయం నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీగా వచ్చి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ఐ ఎఇ నవీన్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎఒ రమేష్, సిడిపిఒ సుగుణ, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మండలంలో అన్ని పంచాయతీలోని జరిగింది. పాఠశాల విద్యార్థులు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మానవహారాన్ని ఏర్పాటె పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. శంబరలో ఎంపిటిసి సభ్యులు పోలినాయుడు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.

సాలూరురూరల్ : మండలంలోని బాగువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛత హీ కార్యక్రమంపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ప్రధానోపాధ్యాయులు జె.రాము నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, ఎంఇఒ ఎం.శ్రీనివాసరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ జెఇ భరత్ చంద్ర, హౌసింగ్ ఎఇ ఎల్.ఉమామహేశ్వరరావు, డి.పకీరు, ఎపిఎం ఎం.నాగభూషణరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, విఆర్‌ఒలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.


సీతానగరం: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదభోగిలిలో డిపిఒ కె.రామచంద్రరావు ఆధ్వర్యాన నిర్వహించారు. సంపూర్ణ స్వచ్ఛ గ్రామప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు.

ఘనంగా వీరేష్ చంద్ర దేవ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కురుపాం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ జన్మదిన వేడుకలు మంగళవారం కురుపాం వైరిచర్ల కోటలో టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య కోలాహంగా జరిగాయి. ఈ జన్మదినం వేడుకలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం వీరేష్ చంద్ర దేవ్ ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలను మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్, ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రారంభించారు. బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబీనాయ, బోనెల విజయ్ చంద్ర వీరేశ్ చంద్రదేవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో గల గాంధీనగర్ వీధి ప్రధాన రహదారి తన జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్, ఎన్టీయార్ విగ్రహాలను ఎమ్మెల్యే విజయచంద్ర, జగదీశ్వరి, బేబినాయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరడానికి ముఖ్య భూమిక పోషించిన యువనాయకుడు వీరేశ్ చంద్ర దేవ్ ఘనతేనన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని వీరేష్ చంద్రదేవ్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేయడం అభినందనీయమని బేబినాయన అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబు సాహెబ్ అంబేద్క ర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషి ంచ విషయమని అన్నారు. కార్యక్రమం లో ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధీ నగర్‌లో అంబేద్కర్ , ఎన్టీఆర్ విగ్రహాలు ఆవిష్కరణ
ఉచిత మెగా మెడికల్ క్యాంప్ , రక్తదాన శిబిరం


కేక్ కట్ చేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

సాక్ష్యం చెప్పలేదనే తప్పుడు కేసులు

యాదవ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరమణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మరిపల్లిలో శనివారం వినాయక నిమజ్జనంలో జరిగిన సంఘటన కేవలం ఎంపిటిసి సభ్యురాలు చేసిన తప్పుడు ఆరోపణలు, చేతలు వల్లేనని, కేవలం వారి స్వార్థంతో అందరిపైనా కేసులు పెడుతున్నారని జిల్లా యాదవ సంఘం కార్యదర్శి కె వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత 50ఏళ్లుగా గ్రామంలో ఏ పార్టీ వారు సర్పంచ్ అయినా, ఎంపిటిసి అయినా ఎటువంటి గొడవల్లేవని, జన్ని అప్పారావు, జన్ని చిన్నారావు, జన్ని సీతారామ్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతే ఇటువంటి గొడవలు, కేసులు వస్తున్నాయని అన్నారు. భూవివాదాల్లో తాను సాక్ష్యం చెప్పలేదని తనపై కక్ష కట్టి తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. తమ వీధిలో యువత వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు చేస్తుండగా మా అన్నయ్య కుమారుడు కసినబోయిన సీతంనాయుడు, మా సోదరి బోను కృష్ణవేణిని మహిళా అని చూడకుండా విచక్షణారహితంగా ఎంపిటిసి జన్ని సీతారాం, ఆమె మరిది జన్నిచిన్నారావు దాడి చేశారని అన్నారు. ఎందుకు కొడుతున్నారని అడిగితే తమ ఇష్టమని, తాము గిరిజనులమని, తాము ఏది చేసినా చెల్లుతుందని, మమ్మల్ని ఎవడూ ఏంచేయలేడని, తమపై అట్రాసిటీ కేసులు పెడతామని దూషించారని ఆరోపించారు. తమపై కేసులు పెట్టడం వెనుక ఎంపిటిసి భర్త అప్పారావు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారని, అందుకే మమ్మల్ని భయపెడుతున్నారని అన్నారు. ఇటువంటి వ్యక్తులు కేసులు పెట్టేటప్పుడు స్థానిక పోలీసులు కూడా గతంలో వీరు ఎలాంటి వ్యక్తులన్న విషయమై దర్యాప్తు చేసి తెలుసుకోవాలని కోరారు. తప్పుడు కేసులు పెట్టిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సర్పంచ్ తొత్తాడి నారాయణమ్మ, గిరిజన నాయకులు తొత్తడి అప్పారావు, నూక రాజు, నారాయణ, కొట్టిశ గోపాల్ పాల్గొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఏజెన్సీలో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అయితే ఈ సీజన్‌లో అధికంగా వైరల్ జ్వరాలు మన్యంలో చాప కింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. మంగళవారం ఏరియా ఆసుపత్రికి 322 ఒపిలు రాగా, వీరిలో 82మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. వీటిలో అధికంగా కీళ్లు, కాలు నొప్పులు, నరాల బలహీనత అధికంగా బాధపడుతున్నారు. ఇప్పటికే డాక్టర్లు సంప్రదిస్తున్నారు. అకాల వర్షాలు, కలుషిత జలాలు తాగడం వల్ల జ్వరాలు చాప కింద నీరులా వ్యాప్తిస్తున్నాయి. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా, ఈ సీజన్‌లో జ్వరాలు వస్తాయని, వీటికి చికిత్స అందజేస్తున్నామని తెలిపారు. అలాగే మందులతో పాటు విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఇఒ డి.గౌరునాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) లో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. పునాది దశ నుండే అక్షరం చదివేలా వారిపై ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది కనుక ఓనమాలు నేర్పించే బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరా, ఎం.పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూపు మారుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంలో భాగంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూపు మారబోతున్నది. మంగళవారం సబ్ రిజిస్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పనులు కార్యాలయంలో చక చకా జరుగుతున్నాయి. బ్రిటీష్ వారి పాలన తలపించేలా రిజిస్టర్ ఎత్తైన పీఠంపై కూర్చోవడం, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు చేతులు కట్టుకొని వారి ముందు నిల్చడం వంటి పద్ధతులకు మంగళం పలుకుతూ, సబ్ రిజిస్టర్ కూర్చునే దిమ్మను పూర్తిగా తీసివేసి సాధారణ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్య అధికారులు ఉండేలా కార్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బండరాళ్లను తొలగించిన పోలీసులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ దంగులగూడ నుంచి పొక్కిరి వెళ్లే మార్గంలో ఇటీవల కురిసిన వర్షాల సమయంలో కొండపై నుంచి బండరాళ్లు జారి రహదారిపై పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు స్పందించి మంగళవారం ప్రొక్లెయిన్ సహాయంతో రహదారిపై అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాపురం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిదిమి రహదారికి మోక్షం కలిగేనా?

ప్రజాశక్తి -వీరఘట్టం

తమ గ్రామానికి బిటి రహదారికి ఎప్పుడు మోక్షం జరుగుతుందని మండలంలోని చిదిమి గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సీఎస్పీ రహదారి నుంచి చిదిమి వరకు రూ.కోటీ 20 లక్షలతో ఉపాధిహామీ చట్టం ద్వారా బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు గత ఏడాది జులై 21న అప్పటి ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శంకుస్థాపన చేశారు. అనంతరం కొంతకాలానికి గుత్తేదారు సీఎస్పీ రహదారి నుంచి చిదిమి దాటి రహదారికి ఇరువైపులా జెసిబి ద్వారా మట్టిపనులు చేపట్టి రహదారిపై 40ఎంఎం చిప్స్ కూడా వేశారు. అప్పట్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఈ ఏడాదిలోపే పనులు పూర్తి చేయాలని గుత్తేదారున్ని ఆదేశించారు. శంకుస్థాపన చేసి సుమారు 14 నెలలు కావస్తున్నా రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉన్నంది. దీంతో పివిఆర్ పురం, చిదిమి, సిఎస్ఆర్‌పేటకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పివిఆర్ పురం గ్రామస్తులు తూడి, అడారు గ్రామాల వైపు, చిదిమి గ్రామస్తులు యు.వెంకంపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. సాక్ష్యాత్తు ఎంపిపి ధమలపాటి వెంకటరమణ నాయుడు గ్రామమైనప్పటికీ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో అర్ధం కాని పరిస్థితని గ్రామస్తులంటున్నారు. ఈ పనులు ఐటిడిఎ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. పనులు జరిగిన ప్రాప్తికి రూ. 22 లక్షలకు పైగా బిల్లులు చెల్లించినట్లు ఉపాధి అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ రహదారి పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని చిదిమి గ్రామస్తులు కోరుతున్నారు.


రాళ్లు తేలిన చిదిమికి వెళ్లే రోడ్డు

ఎట్టకేలకు యు.వెంకంపేటకు రహదారి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేటకు ఎట్టకేలకు సిసి రహదారి పనులు జరుగుతున్నాయి. సీఎస్పీ రహదారి నుంచి యు .వెంకంపేట గ్రామం వరకు సుమారు 750 మీటర్ల దూరంలో రూ.50 లక్షలతో ఉపాధి హామీ నిధులతో ఐటిడిఎ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణ పనులు జరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరందించి ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్దగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగునీరందించి రైతులను ఆదుకోవాలని, పద్మాపురం భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం మండల కార్యదర్శ బోను గౌర్నాయుడు, ఉపాధ్యక్షులు జాడుదొర గంగయ్య, కసినిబోయిన త్రినాధ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెద్ద గెడ్డపై లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి ఎడమ కాలువ నిర్మించి పద్మాపురం పాచిపెంట పెద్దవలస, కర్రివలస, పి.కోనవలస, పణుకువలస, జీగిరాం, కూర్మరాజుపేట తదితర గ్రామాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడంలేదని అన్నారు. ఇప్పటికైనా పెద్దగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగునీరందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దుకాణాల్లో విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పలు హోల్‌సేల్ దుకాణాల్లో మంగళవారం సాయంత్రం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో శ్రీ సాయి కిరణ్, శరణం ట్రేడర్స్, హెూల్ సేల్ ఆయిల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. విడి ఆయిల్ విక్రయాలపై సమాచారం తెలుసుకున్నారు. ఎంఆర్‌పి రేట్ల కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు సాగిస్తే కేసు నమోదు చేస్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. తనిఖీలకు సంబంధించిన నివేదికను విజిలెన్స్ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.


దుకాణాలను తనికీ చేస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

పాముకాటుతో గిరిజన యువకుడు మృతి


ప్రజాశక్తి - పాచిపెంట



మండలంలోని గొట్టూరు పంచాయతీ ఎగువగొట్టూరుకు చెందిన సేబి శ్రీను (24) పాముకాటుతో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గొట్టురూ పంచాయతీ ఎగువగొట్టురుకు చెందిన సేబి శ్రీను తన కుటుంబసభ్యులతో సోమవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి పాము చొరబడింది. నిద్రిస్తున్న తన పెద్దకుమార్తె పై పాము పాకుతుండడాన్ని గమనించిన ఆమె కేకలు వేసింది. కేకలు విన్న శ్రీను నిద్రలేచి వెంటనే ఆ పామును తన చేతితో పట్టుకోగా, అది కాటు వేసింది. కాటు వేసిన వెంటనే నొప్పి లేకపోవడంతో తెల్లవారున 7 గంటల సమయంలో గురువినాయుడుపేట పిహెచ్‌సికి వెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం సాలూరు సిహెచ్‌సిలో చికిత్స పొందుతుండగా, శ్రీను చనిపోయినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

పరామర్శకు వెళ్లి మృత్యువాత

ప్రజాశక్తి - సాలూరురూరల్



తన బంధువులు మృతి చెందాడని పరామర్శకు వెళ్లి ప్రమాదవ శాత్తూ గోడకూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని కొంకివీధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కింకివీధికి చెందిన హరి తవుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందు అదే వీధికి చెందిన పెంటయ్య వెళ్లాడు. మృతదేహాన్ని చూసేందుకు ఇంటిగోడ ఎక్కితుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి ఆయనపై పడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన్ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.